క్లుప్తంగా

బానకచెర్ల నుంచి 30,000 క్యూసెక్కుల నీటి విడుదల



బానకచెర్ల క్రస్ట్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి ఆదివారం 30,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి ఎస్‌ఆర్‌ఎంసీ ద్వారా ఇన్‌ఫ్లో ఉన్న 30,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. తెలుగుగంగ(వీబీఆర్)కు 14,000, జీఎన్‌ఎస్‌ఎస్‌కు 12,000, కేసీసీ ఎస్కేప్‌చానల్‌కు 4,000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని వివరించారు.

గుడిసె దగ్ధం



పూర్తిగా దగ్ధమైన గుడిసె వద్ద బాధిత మహిళ

బండి ఆత్మకూరు: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధమైంది. గ్రామంలో ఎస్సీ కాలనీలో దర్గా మరియమ్మకు చెందిన గుడిసెలో ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో గుడిసె పూర్తిగా కాలిపోయింది. అందులో ఉన్న గృహోపకరణాలు, ధాన్యం, దుస్తులు మంటల్లో పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామస్తుల సహాయంతో మంటలను అదుపు చేశారు. కాగా ఈ ప్రమాదంలో సుమారు రూ. 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి విరాళం



హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డికి నగదు అందిస్తున్న పోలిశెట్టి శ్రీనివాసులు

మహానంది: తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పోలిశెట్టి శ్రీనివాసులు రూ. 5వేలు విరాళం అందించారు. ఈ మేరకు ఆదివారం హెచ్‌ఎం చింతకుంట్ల చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి నగదు అందజేశారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని హెచ్‌ఎం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దేవనాల శ్రీనివాసులు, కుంపటి రమణయ్య, ఏసీ తిమ్మయ్య, సీఆర్‌పీ తిమ్మయ్య పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవారు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం నంద్యాలకు చెందిన హెచ్.పద్మనాభయ్య రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు కె.శివప్రసాద్‌కు అందజేశారు. దాతను దేవస్థానం తరుపున స్వామివారి శేష వస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ఆటోను ఢీకొన్న లారీ



లారీ ఢీకొనడంతో బోల్తాపడిన ఆటో

మహానంది: సీతారామపురం గ్రామం వద్ద ఓ ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. ఆదివారం ఓ ఆటో గ్రామ సమీపంలో ఉన్న ప్రయాణికులతో నంద్యాలకు వెళ్తుండగా గిద్దలూరు నుంచి వస్తున్న లారీ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటోలో ఉన్న ఇద్దరికి స్వల్పగాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు

- కొనసాగుతున్న నమోదు ప్రక్రియ
- సెప్టెంబర్ 15 వరకు అవకాశం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

బండిఆత్మకూరు: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు ఈ- క్రాప్‌తో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. పండించే పంట వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా వారికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల లబ్ధి చేకూరే అవకాశం ఉంది. సాగులో సాయం, ఉత్పత్తులు అమ్ముకోవడం, విపత్తులు సంభవిస్తే నష్టపరిహారం పొందడానికి వీలుంటుంది. దీంతో రైతులందరూ ఈ-క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి పవన్‌కుమార్ సూచించారు. దీనికి సంబంధించిన ప్రక్రియ క్షేత్ర స్థాయిలో జరుగుతోందని, సెప్టెంబర్ 15 నమోదుకు అవకాశం ఉందని తెలిపారు.

81,000 ఎకరాల్లో పంటల సాగు

శ్రీశైలం నియోజకవర్గంలో 81,000 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అందులో 59వేల ఎకరాల్లో వరి, సుమారు 19 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 3వేల ఎకరాల్లో మినుము, ఇతర పంటలు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలను శాఖల వారీగా ఆన్‌లైన్‌లో చేసే ప్రక్రియ (ఈ-క్రాప్)ను గత నెలలోనే ప్రారంభించారు.

ఈ ప్రక్రియలో పంట సాగుహక్కు పత్రాలు పొందిన రైతులకు కూడా అవకాశం కల్పించారు. కాగా, నియోజకవర్గంలో ఇప్పటి వరకు 44,500 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేశారు. వీటితో పాటు 22వేల ఎకరాలలో ఉద్యాన పంటలు కూడా ఉన్నాయి.

పంట వివరాలు

సాగు చేస్తున్న రైతులు తమ సమీపంలోని ఆర్‌ఎస్‌కేలకు వెళ్లి పంట వివరాలను నమోదు చేయించుకోవచ్చు. సాగు చేస్తున్న భూమికి సంబంధించిన సర్వే నంబర్, పట్టాదారు పాసుబుక్, సాగు చేసిన పంట వివరాలు, సాగు విస్తీర్ణం, వంటి వాటిని తెలియజేయాలి. ఇప్పటికే పలుచోట్ల ఆర్‌ఎస్‌కేలలో ఉండే గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు తమ పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నారు.

15 వరకు గడువు



రైతులు సాగు చేస్తున్న పంట వివరాలను సత్వరమే ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. సెప్టెంబర్ 15 వరకు కలెక్టర్ ఇచ్చిన గడువును సద్వినియోగం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో రైతు సేవ కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు పొలాలను సందర్శించి ఈ-క్రాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ఇంతవరకు నమోదు చేయించుకోకుంటే సత్వరమే పైన తెలిపిన వారిని కలిసి, నమోదు చేయించుకోండి. **– పవన్‌కుమార్, వ్యవసాయాధికారి, బండిఆత్మకూరు**

రైతులకు మేలు

ఈ-క్రాప్ వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఏ పంట. ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఎంత మేరకు దిగుబడులు వస్తాయో కచ్చితమైన గణాంకాలు వేసుకునేందుకు అధికారులకు అవకాశం ఉంటుంది. అలాగే ప్రకృతి వైపరీత్యాల సమయంలో పూర్తి స్థాయిలో నష్టపరిహారాలను పొందేందుకు కూడా ఈ విధానం ఉపయోగపడుతుంది. రైతులందరూ శ్రద్ధ తీసుకుని తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలి.

– రాఘవరెడ్డి, రైతు, లింగాపురం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు:స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ ఆదివారం తెలిపారు. మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై అర్జీలు ఇస్తే ఆయా శాఖల అధికారుల ద్వారా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

గోమాతలకు దాణా వితరణ

మహానంది: నంద్యాల పట్టణంలోని గోశాలకు తమ్మడపల్లె గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, నెహ్రూ యువకేంద్రం ఉత్తమ అవార్డు గ్రహీత డి. పెద్దమురళీ ఆదివారం రూ. 10వేల విలువైన రెండు క్వింటాళ్ల దాణా అందించారు. ఈ మేరకు తహసీల్దార్ రమాదేవి, పలువురు మురళిని అభినందించారు.

మహానందిలో తగ్గిన భక్తుల సందడి

శ్రావణమాసం ముగియడంతో మహానంది ఆలయంలో భక్తుల సందడి తగ్గింది. ఆదివారం సెలవు రోజైనా కొద్దిసంఖ్యలో మాత్రమే భక్తులు ఆలయానికి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. కాగా ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవారికి అష్టవిధ మహా మంగళ హారతులు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో మహానందీశుడి దంపతులకు నిత్య కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది.

డీఏపీ బస్తాల సీజ్



దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

బండి ఆత్మకూరు/ మహానంది : బండిఆత్మకూరు మండలంలోని పార్నపల్లి గ్రామంలో ప్రశాంతి ఫెర్టిలైజర్ దుకాణంపై వ్యవసాయ అధికారులు, కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్, పోలీస్ అధికారులు కలిసి సంయుక్తంగా ఆదివారం చేపట్టిన దాడుల్లో 103 బస్తాల డీఏపీని సీజ్ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్ పవన్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. నాగరాజు అనే రైతుకు బస్తా డీఏపీ ఎంఆర్‌పీ రూ.1350 కాగా, దుకాణం వారు రూ. 1420లకు అమ్మినట్లు, ఫోన్ పే ద్వారా లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు లభించాయని చెప్పారు. సదరు దుకాణంపై ఈసీ యాక్ట్ 1955 ప్రకారం 6ఏ కేసు నమోదు చేసి రూ.1,39,050 విలువగల 103 బస్తాల డీఏపీని సీజ్ చేశామన్నారు. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు రిపోర్టు పంపిస్తామని తెలిపారు. అలాగే మహానంది మండలంలోని గాజులపల్లెలో దీప్తి ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో 131 బస్తాల డీఏపీ ఎరువులను సీజ్ చేసినట్లు వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు రూ.1,76,850 విలువ ఉంటుంది. యూరియా 1.845 మెట్రిక్ టనుల యూరియా అమ్మకాలను నిలుపుదల చేశారు. దాడుల్లో కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ వెంకటప్రసాద్, ఎస్ఐ జగన్‌మోహన్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా ఎస్‌ఐగా మల్లికార్జున

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా నూతన ఎస్‌ఐగా మల్లికార్జునను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న కె.మల్లికార్జునను జూపాడుబంగ్లా ఎస్‌ఐగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణను సీసీఎస్ నంద్యాలకు బదిలీ చేయగా.. అక్కడి నుంచి కర్నూలు డీటీసీ(పోలీసు శిక్షణాకేంద్రం)కి అటాచ్‌చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి



ఏఈ రవీంద్రనాయక్

వెలుగోడు: వినాయకచవితి పండగ సందర్భంగా గణేష్ విగ్రహాల తరలింపులో, మండపాల వద్ద విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ రవీంద్రనాయక్ సూచించారు. ఆదివారం వినాయక మండపాల వద్ద ఏర్పాట్లు, మండప నిర్వాహకులకు, ప్రజలకు ఏఈ పలు సూచనలు చేశారు. విద్యుత్తు శాఖ సిబ్బంది ద్వారానే కనెక్షన్లు తీసుకోవాలని, ఐఎస్ఐ మార్క్ ప్రామాణిక విద్యుత్ తీగలే వాడాలన్నారు. మండప నిర్వాహకులు ప్రతిరోజు తప్పనిసరిగా తీగలను పరిశీలించాలని సూచించారు. తీగలు తెగిపడినా లేదా అత్యవసర పరిస్థితుల్లో 1912కి గానీ, సమీపంలోని ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు



మాట్లాడుతున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: దొంగతనాలకు పాల్పడిన వారు ఎవరూ చట్టం నుంచి తప్పించుకోలేరని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని నాగటూరు గ్రామ పొలిమేరలో ఉన్న మల్యాల ఎత్తిపోతల పథకం రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలకొట్టి కాపర్ వైర్, కాపర్ కడ్డీలు చోరీ చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ, ఎస్ఐ చంద్రశేఖర్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకానికి చెందిన రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లకు చెందిన కాపర్ వైర్, కాపర్ కడ్డీలను మహారాష్ట్రంలోని పర్బని జిల్లా తడ్కలాస్, పుల్కలస్ గ్రామాలకు చెందిన రాజేంద్ర బబస్ బోలె, నాందేవ్ బిలాస్‌రావ్, సంజయ్ లక్ష్మణ్ హర్ గావోకర్‌లను అరెస్టు చేయడం జరిగిందన్నారు. లక్ష రూపాయల విలువ చేసే కాపర్ వైర్, కాపర్ కడ్డీలు నెల రోజుల క్రితం దొంగలించారని తెలిపారు. టెక్నికల్ ఆధారాలతో దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించి వారం రోజుల్లో పట్టుకోవడం జరిగిందని చెప్పారు. నిందితుల నుంచి బొలెరో వాహనం, బైక్, లక్ష రూపాయలను, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు మహారాష్ట్రకు ఎస్ఐ చంద్రశేఖర్ పోలీసులు బాలకృష్ణ, ఓబులయ్య, నాగరాజు, సిబ్బంది ఈ కేసును ఛేదించేందుకు ఎంతో కష్ట పడ్డారని అభినందించారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: మండలంలో భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు చొప్పున పరిహారం అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షులు పి.మాబాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేరకు ఆదివారం సీపీఎం పార్టీ రైతు సంఘం నాయకులు వరదల వల్ల నష్టపోయిన పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఒకవైపు కల్తీ విత్తనాలు, మరోవైపు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక మరోవైపు యూరియా కొరతతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ అధికారులు పొలాల్లో పర్యటించి నష్టపోయిన పంటల వివరాలను సేకరించి, ప్రభుత్వానికి పంపి పరిహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, శ్రీను, రైతులు విజయకుమార్, పెన్నా గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సండే సైకిల్‌తో పోలీసులకు ఆరోగ్యం



సండే సైకిల్ కార్యక్రమం చేపట్టిన రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐలు, పోలీసులు

నందికొట్కూరు: పోలీసుల ఆరోగ్యం కోసమే సండే సైకిల్ కార్యక్రమం నిర్వహిస్తునట్లు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం చెప్పారు. ఆదివారం పట్టణంలోని పోలీసులు సండే సైకిల్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు 24 గంటలు డ్యూటీలో ఉండటంతోనే శరీర దారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదన్నారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు సండే సైకిల్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఆదివారం గంట పాటు సైకిల్ తొక్కడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఏ.కోడూరులో కార్డెన్ సెర్చ్



సోదాలు చేస్తున్న పోలీసులు

బండి ఆత్మకూరు : మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో ఎస్.ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లను, వాహనాల పత్రాలను పరిశీలించారు. నంబర్ ప్లేట్లు లేని 10 మోటార్ సైకిళ్లను, అలాగే గ్రామంలో అక్రమంగా లిక్కర్ బాటిళ్లు అమ్ముతున్న శేఖర్ అను వ్యక్తి వద్ద నుంచి 10 బాటిళ్లను, పుల్లయ్య అను వ్యక్తి వద్ద 11 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలో అశాంతి, చట్ట విరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

- ఆత్మకూరు: టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొట్టాల చెరువు, ఆత్మకూరు రూరల్ సర్కిల్‌లోని పాములపాడు, ఎర్రగూడూరు గ్రామాల్లోని అనుమానితుల ఇళ్లల్లో ఆదివారం ఆత్మకూరు సీఐ రాము ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లు, అనుమానిత వ్యక్తులు, రౌడీషీటర్లు, నేరచరిత్ర గల వారి ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ,కొడుకుకు గాయాలు




గాయపడిన పూజ, వినయ్

ఆళ్లగడ్డ: మండలంలోని బత్తలూరు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ, కొడుకు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. హైదరబాద్ మనికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పూజ అహోబిలం క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో బత్తలూరు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న బ్రిడ్జినీ ఢీ కొట్టి లోపలికి పడిపోయింది. ప్రమాదంలో కారులో ఉన్న పూజ, కుమారుడు వినయ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

శ్రీశైలం ముంపు బాధితులపై విచారణ



రైతులతో విచారిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్

నందికొట్కూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో భూములు కోల్పోయిన బాధితులను ఆదివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్ విచారించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో భూములు కోల్పోయిన రైతులు లోక్ అదాలత్‌ను ఆశ్రయించారన్నారు. ముంపు బాధితులను విచారించి నివేదికను పైస్థాయి అధికారులకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చడంలో ప్రభుత్వం విఫలం

- అధికార పార్టీ నాయకులు పక్కదారి పట్టిస్తున్నారు
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో యూరియా కొరతను తీర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, అధికార పార్టీ నాయకులు యూరియాను పక్కదారి పట్టిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వ భూములను దారాదత్తం చేస్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలో పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ తగ్గించాలన్న ఉద్దేశంతో యూరియాను సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా కాకుండా అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి యూరియా వెళ్లిపోతుందని ఆరోపించారు. పంటలకు అవసరమైన రసాయనిక ఎరువులు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులను ఆదుకుంటామని చెబుతున్నా, ఆచరణలో చూపడం లేదన్నారు. పొగాకు రైతులను ఆదుకోవడంలో జిల్లా మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, నాయకులు రాజశేఖర్, రామచంద్రుడు, సుబ్బరాయుడు, రాజు పాల్గొన్నారు.

మద్యం మత్తులో లైన్‌మన్



తాగి పడిపోయిన విద్యుత్ లైన్‌మన్

రుద్రవరం: మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్ నిత్యం మద్యం మత్తులో తూలుతున్నాడు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏదైన విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించాల్సి ఉండగా.. విధులను వదలేసి, వేళాపాల లేకుండా నిత్యం మద్యం మత్తులో ఉంటున్నాడు. తాగి మోటార్ సైకిల్ ప్రయమాణం చేస్తూ.. వాహనాన్ని నడపలేక ఎక్కడ పడితే అక్కడ పడిపోతున్నాడు. దీంతో స్థానికులు విద్యుత్ సమస్యలకు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. ఆయన ప్రవర్తనపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆ శాఖ ఏఈ రాజశేఖర్‌ను వివరణ కోరగా.. ఆ ఉద్యోగి నిత్యం మద్యం సేవిస్తుండటం వాస్తవమేనని గతంలో ఆయనపై పలువురు రైతులు ఫిర్యాదు చేశారని, తోటి సిబ్బందిని దుర్భాషలాడుతున్నాడని, పద్ధతి మార్చుకోమ్మని ఉన్నతాధికారులు కూడా మందలించారని.. అయినా ఆయనలో మార్పురాలేదని చెప్పారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలకు సిఫార్స్ చేస్తానని తెలిపారు.

హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదు



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన దృశ్యం



విద్యార్థినులకు విద్యా సామగ్రి, న్యాపికిన్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల: హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, వారిని దూరం పెట్టొద్దని జిల్లా టీబీ అధికారిణి తేజశ్విణి పేర్కొన్నారు. హెచ్‌ఐవీతో బాధపడుతున్న 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు చైతన్య కళాభారతి సంస్థ, ఎస్ఐసీఈడబ్ల్యూటీ వారి ఆధ్వర్యంలో సైకిళ్లు, విద్య సామగ్రి, శానిటరీ న్యాప్‌కిన్స్‌ను సంస్థ అధ్యక్షుడు వాసగిరి విజయభాస్కర్ ఆదివారం పంపిణీ చేశారు. నంద్యాల డివిజన్‌లో 27 మంది విద్యార్థులకు, ఆదోని డివిజన్‌కు చెందిన 19 మంది, కర్నూలు డివిజన్‌కు చెందిన 16 మంది విద్యార్థినులకు అందజేశారు. తేజశ్విణి, ఉమ్మడి కర్నూలు జిల్లా నేస్తం నెట్‌వర్క్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే మందులు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయుడు మద్దిలేటి, సొసైటీ నాయకురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

జేవీవీ చర్యలు అభినందనీయం



మాట్లాడుతున్న రామచంద్రారావు

నంద్యాల(న్యూటౌన్): సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలతో పాటు ఇతర సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని సీనియర్ న్యాయవాది రామచంద్రారావు, ప్రముఖ కార్డియాలజిస్ట్ క్రాంతి చైతన్య, న్యూక్లియస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సన్‌రైజ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలను జేవీవీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జేవీవీ లక్ష్యాలు, ఆశయాల గురించి వివరించారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ప్రతినిధుల సభలో నంద్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ తెలిపారు. అధ్యక్షుడిగా జోన్ రామ్మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులుగా రామరాజు, లతీఫ్, మరియదాసు, సర్వాజ్ఞమూర్తి, జిల్లా కార్యదర్శులుగా చిన్నయ్య, పునీత్, జయకర్, మాణిక్యంశెట్టి, సభ్యులుగా బాబాఫక్రుద్దీన్, భాస్కర్, రమేష్‌నాయుడు, నరసింహారెడ్డి ఎన్నికయ్యారని వివరించారు.

•మొదలైన చవితి సందడి



కాలువ వెంట పిచ్చిమొక్కలు తొలగిస్తున్న యువకులు

మహానంది: గ్రామాల్లో వినాయకచవితి సందడి ప్రారంభమైంది. ఇప్పటికే పలు గ్రామాల్లోకి విగ్రహ కమిటీ సభ్యులు విగ్రహాలను కొని సిద్ధంగా పెట్టుకున్నారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ మేరకు మహానంది సమీపంలోని అయ్యన్ననగర్‌లోని తెలుగుగంగ వినాయక ఘాట్ వద్ద ఆదివారం కాలువ వెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పనులు చేయిస్తున్నారు.